
సాక్షి
గుంటూరు
శనివారం । 15 । జూలై । 2023



కార్మెల్ మాత ఉత్సవాలు ప్రారంభం
ఫిరంగిపురం: కార్మెల్ కొండపై కార్మెల్ మాత ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దివ్యపూజాబలి కార్యక్రమంలో విచారణ గురువు రాకేష్‌రెడ్డి వాక్యోపదేశం చేశారు.



సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 716 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 482 క్యూసెక్కులు వదిలారు.



దుర్గమ్మ సన్నిధిలో సారె సంబరం
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు సారెను సమర్పించారు.

న్యూస్‌రీల్

22న ప్రత్యేక లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: ప్రత్యేక లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఒ.వెంకట నాగేశ్వరరావు శుక్రవారం కోరారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 22న ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదాలత్‌లో మోటారు వాహన ప్రమాదాల కేసులు, ముందస్తు వ్యాజ్యాలు, భూసేకరణ కేసులు మాత్రమే రాజీ మార్గం ద్వారా పరిష్కరించనున్నట్టు వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

36,990 ఓటర్ కార్డులు




గుంటూరు వెస్ట్: కొత్తవి, చిరునామా మార్చుకున్నవి మొత్తం 36,990 ఓటర్ కార్డులు దరఖాస్తు చేసుకున్న వారికి అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో చంద్రమౌళీ నగర్ పోస్టల్ శాఖాధికారులకు ఓటరు కార్డులు ఉన్న కవర్లను అందజేశారు. జిల్లాలోని 7 నియోజవర్గాల్లో అర్హులకు ఈ కార్డులు స్పీడ్ పోస్ట్ ద్వారా తపాలా శాఖ అందించనుంది.

22న పుస్తకాల పంపిణీ



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 22న ఆయా పాఠశాలల్లోనే పుస్తకాలు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాల ద్వారా 20వ తేదీనే పుస్తకాలను సంబంధిత పాఠశాలలకు చేర్చాలన్నారు. అలాగే, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు వచ్చే నెల నుంచి టేక్ హోం రేషన్ అందజేయాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంను కిలోకు రూ.40 వెచ్చించి ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం కొనుగోలు చేస్తోందన్నారు. వాటిని అక్రమ మార్గంలో విక్రయించినా, కొనుగోలు చేసినా నేరమని తెలిపారు. ఈ బియ్యాన్ని అన్నం, టిఫిన్స్, తినుబండారాల్లోనూ వాడుకోవచ్చని తెలిపారు. సమావేశంలో డీఎస్‌ఓ కోమలి పద్మ, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, డీఈఓ శైలజ, బి.మనోరంజని జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యార్డులో 29,955 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 26,968 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 29,955 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.13,000 నుంచి 22,300 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,000 నుంచి రూ. 24,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,098 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 518.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,547 ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 5,897 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.

జీవనశైలితో తిరోగతి

పెరుగుతున్న మధుమేహం, రక్తపోటు
- మూడోవంతు ప్రజలకు ఇవే సమస్యలు..
- బీపీ తెలుసుకోలేని వారు ఎందరో..
- అవగాహన లేక పక్షవాతం బారిన..
- తీసుకునే ఆహారం, ఒత్తిడే కారణం
- 'ఫ్యామిలీ ఫిజీషియన్' ఓపీ సేవల్లో గుర్తింపు
- మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ప్రజల్లో అంతర్లీనంగా ఉన్న జబ్బులను గుర్తించి చికిత్స చేసేందుకు దోహదపడుతోంది. గుంటూరు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక వైద్యశిబిరాల్లో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. జిల్లా మొత్తం జనాభాలో 35 శాతం మంది బీపీ, షుగర్‌లతో బాధపడుతున్నట్టు తేలింది. దీంతో వైద్యసిబ్బంది వీరికి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేస్తున్నారు. పక్షవాతం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన రోగుల ఇంటికే వెళ్లి చికిత్స అందిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉరుకులు, పరుగులతో కూడిన ఆధునిక జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి మానవ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఉన్న జనాభాలో మూడోవంతు మంది రోగాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా రక్తపోటు(బీపీ), మధుమేహం (షుగర్) వెంటాడుతున్నాయి. ఆరోగ్యంగానే ఉన్నాం. ఎటువంటి ఇబ్బందులూ లేవని ఆరోగ్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల చాలా మంది నష్టపోతున్నారు. ఎప్పుడోఒకప్పుడు పరీక్షలు చేయించుకుంటే అనేక వ్యాధులు బయటపడుతున్నాయి. కొన్ని ప్రమాదకరంగా మారుతున్నాయి. మారుతున్న జీవన విధానంలో షుగర్, బీపీ సైలెంట్ కిల్లర్లుగా మారుతున్నాయి. కోవిడ్ అనంతర పరిణామాలలో మధుమేహం పెరుగుతూ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో గ్రామాలలో ఇంటివద్దకే వైద్య సేవలు అందిస్తోంది. ఇందులో ఎక్కువగా రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులే ఉంటున్నట్లు గుర్తించారు.



ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో మంచానికే పరిమితమైన మహిళను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ఫ్యామిలీ ఫిజీషియన్ పరీక్షల్లో తేలింది ఇదే..

జిల్లా గ్రామీణ జనాభా	: 2,91,766
మొత్తం పరీక్షలు	: 1,27,937
రక్తపోటు ఉన్న వారు	: 57,965
షుగర్ సోకిన వారు	: 47,521
రెండూ ఉన్న వారు	: 39,666

హైబీపీ బాధితులే ఎక్కువ



రక్తపోటు సాధారణంగా 120/80 ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే, పరీక్షించిన ప్రతిసారీ ఎక్కువే చూపిస్తుంటే హైబీపీ ఉన్నట్లే. అలా కాకుండా 90/60 కంటే తక్కువగా ఉంటే, అదీ తరచూ అలాగే ఉంటే లోబీపీగా గుర్తించాలి. హైబీపీ వచ్చిన వారితో పోల్చుకుంటే లోబీపీ బాధితుల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. బీపీని నిర్లక్ష్యం చేస్తే అది పక్షవాతానికి దారితీస్తుంది. కిడ్నీలతోపాటు, మెదడు, కళ్లపై ప్రభావం చూపుతుంది. నలభై ఏళ్ల దాటితే మధుమేహం, రక్తపోటు సాధారణ జబ్బులుగా వస్తున్నాయి. వీటిని పట్టించుకోకపోవడం వల్ల తీవ్రనష్టం వాటిల్లుతుంది. మధుమేహ బాధితుల్లో ఏదో ఒక అవయవంపై ప్రభావం పడుతుంది. గుండె, ఊపిరితిత్తులకూ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

రోజూ నడక తప్పనిసరి

రోజూ తప్పని సరిగా వాకింగ్ చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. రోజుకు అరగంటకు తక్కువ కాకుండా నడవడం వల్ల బీపీతోపాటు, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. ఆహార నియమాలు పాటించాలి. ఆహారంలో ఉప్పు తక్కువగా తీసుకోవాలి. వంటల తయారీలో నూనెలు, కొవ్వు పదార్థాల వాడకం తగ్గించాలి. మసాలాలు, కారం వాడకాన్ని నియంత్రించాలి. నిల్వపచ్చళ్లు, నిల్వ ఉంచిన ఆహారాలు, బేకరీ ఐటమ్స్, అప్పడాలు, ఫాస్ట్‌ఫుడ్స్ పూర్తిగా తగ్గించాలి. వేపుళ్లు, చిప్స్, నూడుల్స్, పిజ్జా వంటి వాటిని పూర్తిగా నిషేధించాలి. ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకు ప్రశాంతంగా ఉండేందుకు యత్నించాలి.

క్రమం తప్పకుండా మందులు

గత ఏడాది చివరి నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేస్తోంది. గుంటూరు జిల్లా పొన్నూరు, తెనాలి, మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాలలో 211 విలేజి హెల్త్ క్లినిక్ (వీహెచ్‌ఎస్)లలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించింది. పరీక్షల్లో రోగ నిర్ధారణ అయితే వైద్యసిబ్బంది చికిత్స చేసి నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. మధ్యలో ఏదైనా సమస్య వస్తే విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సేవలు అందిస్తున్నారు.



ప్రత్యేక శిబిరంలో రక్తపోటు పరీక్షిస్తున్న డాక్టర్

ఇళ్ల వద్దకే వెళ్లి పరీక్షలు



ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రతి గ్రామానికీ నెలలో రెండు సార్లు వెళ్తున్నారు. ఇళ్ల వద్దకే వెళ్లి బీపీ, షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు చేయడం వల్ల రోగుల సంఖ్య బయట పడుతోంది. ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ పెట్టాలి. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సలహా మేరకు మందులు వాడుతూ ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేస్తే రోగాలను అదుపులో పెట్టుకోవచ్చు.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ

వయస్సుతో సంబంధం లేకుండా బీపీ



ఆధునిక జీవనశైలి వల్ల వయస్సుతో సంబంధం లేకుండా అధిక రక్తపోటు బారిన పడుతున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి. ముందు జాగ్రత్తలతో వ్యాధులు దరిచేరవు. వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఒత్తిడి లేకుండా చూసుకోవాలి.

డాక్టర్ రేపూరి హరికృష్ణ, సీనియర్ జనరల్ ఫిజీషియన్,గుంటూరు

షుగర్ అదుపులో లేకపోతే అనర్థాలే



షుగర్ వ్యాధి అదుపులో లేకపోతే ఎన్నో అనర్థాలు తలెత్తుతాయి. అవయవాల పనితీరుపై షుగర్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. చిన్న వయస్సులోనే షుగర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి. రోజూ వ్యాయామంతో షుగర్‌ను నియంత్రణలో పెట్టుకోవచ్చు.

– డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, మధుమేహ వ్యాధి నిపుణులు

పులకించె.. చూశాక..



గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారు శాకంబరీ అలంకారంలో మెరిశారు. దేవేరితో పాటు అంతరాలయమూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు సుగంధ ద్రవ్యాలతో శోభాయమానమై మురిసింది. అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తల్లి మనోహర రూపాన్ని చూశాక పులకించి పోయారు. ఆధ్యాత్మికోత్సాహంలో ఓలలాడారు. ఆదివారం వరకూ అమ్మ శాకంబరిగా దర్శనమిస్తారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు కదంబ ప్రసాదాన్ని వితరణ చేశారు.

–పెదకాకాని

23 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పలు ఆరోగ్య కేంద్రాల్లో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా (ఎంఎల్‌హెచ్‌పీ) 23 మందికి నూతనంగా ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చారు. శుక్రవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో (ఆర్డీ) జరిగిన కౌన్సెలింగ్‌లో ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు విధులను చిత్తశుద్ధితో నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. శనివారం మూడు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డాక్టర్ యాస్మిన్ వెల్లడించారు.

కనకదుర్గ వారధిపై చైన్‌స్నాచింగ్

తాడేపల్లి రూరల్: ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ పెదకాకాని వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఓ మహిళ మెడలో ఉన్న బంగారపు గొలుసును లాక్కునేందుకు ప్రయత్నం చేశారు. ఆ మహిళ అప్రమత్తం కావడంతో ఆ ఇద్దరు గుంటూరు వైపు పారిపోయారు. వెంటనే పోలీస్ ఉన్నతాధికారులు నార్త్‌సబ్ డివిజన్‌లో పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వగా పోలీసులు పది నిమిషాల నుంచి ఇరవై నిమిషాలలోపు జాతీయ రహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. పెదకాకానిలో బాధిత మహిళ చెప్పిన వివరాల ప్రకారం ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్నారు. పెదకాకానిలో జరిగిన గంట తరువాత కనకదుర్గ వారధిపై విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఒంటరి మహిళను టార్గెట్ చేసి మెడలో ఉన్న చైన్‌తో పాటు నల్లపూసల గొలుసును లాక్కొని క్షణాల్లో మాయమయ్యారు.

బాధిత మహిళ చెప్పిన వివరాల ప్రకారం కుంచనపల్లిలో చీరెల దుకాణం నిర్వహించే మంచినీళ్ల వెంకట రమణ దంత సమస్యతో విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా కనకదుర్గ వారధిపై ఇద్దరు యువకులు వెనుక నుంచి వచ్చి తన మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు గొలుసు, ఒక కాసు నల్ల పూసల గొలుసు, సూత్రాన్ని బైకుపై వెనుక కూర్చొన్న వ్యక్తి లాగాడని ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడిపోయానని తెలిపింది. పెదకాకానిలో మహిళ మెడలో బంగారపు గొలుసు లాగేందుకు ప్రయత్నించిన ఆ ఇద్దరు యువకులే అయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

రూ. 10 లక్షలు దోపిడీ

గుంటూరు ఈస్ట్ : రూ. 10 లక్షలు నగదు ఉన్న బ్యాగును ఆగంతకుడు తీసుకుని పరారైన ఘటనపై గుంటూరు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరి హరిబాబు అనే వ్యక్తి తాను పనిచేసే చిల్లీస్ కంపెనీ డబ్బులు డ్రా చేసేందుకు శుక్రవారం లక్ష్మీపురంలోని హెడీఎఫ్‌సీ బ్యాంకుకు వెళ్ళాడు. రూ.10 లక్షలు డబ్బులు డ్రా చేసి బ్యాగులో పెట్టుకుని బయటకు వచ్చి ద్విచక్ర వాహనానికి తగిలించాడు. ఓ వ్యక్తి హరిబాబు వద్దకు వచ్చి డబ్బులు కింద పడ్డాయని చెప్పాడు. హరిబాబు కిందకు వంగి కిందపడిన డబ్బులు తీసుకుంటుండగా మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి డబ్బులు ఉన్న సంచిని లాక్కుని పరారయ్యాడు. హరిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండగా నిలిచే నేత

- చేనేత రంగానికి సీఎం జగన్ జవసత్వాలు
- నేతన్న నేస్తం ద్వారా ప్రతి కార్మికుడికీ రూ.24 వేలు
- 21న నేతన్న నేస్తం ఐదో విడత పంపిణీ

చీరాల: గత పాలకుల నిర్లక్ష్యంతో కునారిల్లిన చేనేత రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరిలూదుతున్నారు. సొంత మగ్గం ఏర్పాటు చేసుకుని స్వయంగా చేనేత వస్త్రాలు నేసి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని ఆర్థికంగా నిలబడేందుకు ప్రతి కార్మికుడికీ వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తున్నారు.

వైఎస్సార్ హయాంలోనూ వైభవం

వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా ముఖ్యమంత్రిగా ఉండగా చేనేతలకు అండగా నిలబడ్డారు. చేనేత రుణబకాయిలు రూ.300 కోట్లు మాఫీ చేశారు. నిర్వీర్యమైన ఆప్కోకు నిధులు కేటాయించి బలోపేతం చేశారు. చిలపనూలు, రంగు, రసాయనాలపై 10 శాతం సబ్సిడీని ప్రకటించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అప్పటివరకు ఉన్న చిలపనూలుపై 9.2 శాతం ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేయించారు.

నేతన్నకు నేనున్నానంటూ..

తండ్రి అడుగుజాడల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టగానే చేనేత కార్మికుల కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికీ ఏటా రూ.24 వేలు చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతలుగా నగదు జమ చేశారు. ఈనెల 21న నెల్లూరు జిల్లా వెంకటగిరిలో ఐదో విడత పంపిణీ కార్యక్రమానికి పూనుకున్నారు. గతంలో సహకార రంగం (సొసైటీ)లో ఉన్న కార్మికులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేవి. అయితే నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికీ ఆర్థిక సాయం అందుతోంది.

ఆప్కో ద్వారా కొనుగోళ్లు

మగ్గంపై నేసిన వస్త్రాల కొనుగోలుకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆప్కోకు నిధులు కేటాయించి దాని ద్వారా వస్త్రాలను కొనుగోలు చేయిస్తున్నారు. ఇవి కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన, అమ్మఒడి, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా, ముద్రా రుణాలూ చేనేత కార్మికులకు అందుతున్నాయి.



జగనన్న సాయం భేష్

వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్దది చేనేత రంగం. దీని అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయం. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు అందించడంతోపాటుగా ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు, ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నారు. రంగులు, రసాయనాలపై పన్నులు తగ్గించారు.

– దామర్ల బాలకృష్ణ
చేనేత కార్మికుడు, ఈపురుపాలెం



జగనన్నకు రుణపడి ఉంటాం..


సీఎం జగనన్న మా సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. చేనేతలు సొంత మగ్గం ఏర్పాటు చేసుకుని వృత్తిలో రాణించేందుకు 'నేతన్ననేస్తం పథకాన్ని రూపొందించి ఏడాదికి రూ.24 వేలు అందించడం గొప్ప సాయం. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–కొసనం జ్యోతిర్మయి. చేనేత కార్మికురాలు, ఈపురుపాలెం

నేతన్న నేస్తం లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
2019–20	7,780	18.67
2020–21	7,589	18.21
2021–22	7,768	18.64
2022–23	8,286	19.88
2023–24 (తాజాగా)	8,378	20.11

మగ్గం కొనుక్కున్నా



నేతన్న నేస్తం ద్వారా మగ్గం కొనుక్కున్నా. గతంలో పెట్టుబడులకు ఇబ్బందులు పడేవాళ్లం. నూలు కొనుగోలు చేయాలన్నా సమస్యగా ఉండేది. చాలా అవస్థలు పడేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ. 24 వేలు అందిస్తున్నారు. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వం కలకాలం ఉండాలని కోరుకుంటున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఆయన వల్లే మా జీవితాల్లో మార్పు వచ్చింది.

– వార్తి సరోజిని, రామన్నపేట

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

పట్నంబజారు : రహదారి భద్రతే ధ్యేయంగా పోలీసు శాఖ సమన్వయం చేసుకుని ప్రమాదాలు తగ్గించేందుకు అందరూ పాటుపడాలని రవాణా శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ డాక్టర్ బి.కృష్ణవేణి చెప్పారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఓ కార్యాలయంలో శుక్రవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధికారుల సమావేశం జరిగింది. కృష్ణవేణి మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్‌లు వాహనాలు నడపడంపై దృష్టి సారించాలన్నారు. విద్యా సంస్థల్లో అవగాహన సదస్సు నిర్వహించి డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. లారీలు, ట్రాక్టర్లు, ఆటోల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. త్రైమాసిక పన్నుల విషయంలో నిర్ణీత సమయంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే వారికి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. తనిఖీల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను పూర్తి స్థాయిలో జరిమానాలు చెల్లించిన తర్వాతే విడుదల చేయాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల డీటీసీలు, షేక్ కరీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంయుక్త కమిషనర్ కృష్ణవేణి

పసుపు సాగుకు శ్రీకారం

- నాగలిపట్టి విత్తనం నాటుతున్న రైతన్న
- ఊతమిస్తున్న ప్రభుత్వ మద్దతు ధర కొనుగోళ్లు


పసుపు విత్తుతున్న కూలీలు

తెనాలి: పంటల్లో పసిడిగా... ఇంటిల్లిపాదీ శుభప్రదంగా భావించే పసుపు పంట సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఏటికేడాది దిగుబడులు తగ్గుతున్నా, మార్కెట్ ధరలు గిట్టుబాటు కాకున్నా, రాష్ట్ర ప్రభుత్వమే రంగంలోకి దిగి మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటం కొంత ఊరటనిస్తోంది. అయినా కొందరు రైతులు పంట మార్పిడికి వెళుతున్నా, సంప్రదాయంగా పసుపును నమ్ముకున్న రైతులు సాగును కొనసాగిస్తున్నారు. దీంతో కొద్దిరోజులుగా ఖరీఫ్ సీజనుకు పసుపు విత్తుతున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉద్యానశాఖ తెనాలి, గుంటూరు డివిజన్ల పరిధిలోనే పసుపు సాగవుతోంది. ఇందులో తెనాలి డివిజనుదే అగ్రస్థానం. 2021–22లో 8,166 ఎకరాల్లో పసుపు సాగుచేశారు. 2020–21తో పోల్చితే ఈ విస్తీర్ణం 2,479 ఎకరాలు తగ్గింది. ఆ ఏడాది 10,645 ఎకరాల్లో పసుపు పండించగా, అంతకుముందు ఈ విస్తీర్ణం 11,277 ఎకరాలుగా ఉంది. 2018–19లో 12,057 ఎకరాల్లో పసుపు సాగైంది. ఉమ్మడి జిల్లాలో పసుపు పంట విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోందని చెప్పేందుకు ఈ గణాంకాలే నిదర్శనం. పెట్టుబడి ఖర్చులు పెరుగుతూ దిగుబడులుల తగ్గిపోవటం, మార్కెట్ ధరలు సరిగా లేకపోవటం ఇందుకు ప్రధాన కారణం.

జిల్లాల పునర్విభజనంతో తెనాలి డివిజను లోని అత్యధిక మండలాలు బాపట్ల జిల్లా పరిధిలోకి వెళ్లాయి. విభజిత గుంటూరు జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,337 ఎకరాలు. 2022–23 సీజనుకు కేవలం 3,864 ఎకరాల్లోనే రైతులు పసుపు సాగుచేశారు. ఇందులో తెనాలి నియోజకవర్గంలోనే అత్యధికంగా 2,257 ఎకరాల్లో పసుపు వేశారు. 2021–22తో పోలిస్తే ఇక్కడే 1,021 ఎకరాల్లో పంట తగ్గింది. రెండేళ్ల క్రితం అధిక వర్షాలకు దుంపకుళ్లుతో పంట నష్టపోయిన ఉమ్మడి జిల్లాలోని పసుపు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బీమా పరిహారాన్ని అందించి ఆదుకుంది. 2022–23లో పసుపు కనీస విస్తీర్ణం 5 వేల ఎకరాలకన్నా తక్కువగా 3,864 ఎకరాల్లోనే సాగవటంతో విభజిత గుంటూరు జిల్లాలో పసుపునకు బీమా వర్తించలేదు. దీనికితోడు మార్కెట్ ధరల్లో మాంద్యం నెలకొనటంతో ప్రభుత్వమే మళ్లీ ఈ ఏడాది కూడా క్వింటాలు రూ.6,870లకు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

ఈ నేపథ్యంలో 2023–24 ఖరీఫ్ సీజనుకు పసుపు సాగుకు రైతులు నాగలి పట్టారు. ఏటా కడప, మైదుకూరు, సేలం, టేకూరుపేట రకాలు, కేరళకు చెందిన ప్రగతి రకం పసుపు విత్తనాలను విత్తేవారు. ఈ పర్యాయం 60 శాతం రైతులు సేలం రకం విత్తనాన్నే ఆదరిస్తున్నారు. దిగుబడి గ్యారెంటీ, దాదాపు అయిదుశాతం కుర్కుమిన్ ఉండటంతో ఈ రకాన్నే ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. కొల్లిపర మండల గ్రామం తూములూరుకు ఏటా సీజనుకు ముందే లారీల కొద్దీ విత్తన పసుపును తీసుకొచ్చి, రైతులకు విక్రయించేవారు. ఈసారి కేవలం కడప, సేలం రకాలు మాత్రమే వచ్చాయి. కడప విత్తనం ధర క్వింటాలు రూ.3800–4000 ఉంటే, సేలం విత్తనం రూ.4800–5100 ధర పలుకుతోంది. కడప విత్తనం ఆరు పుట్లు (పుట్టు 225 కిలోలు) వినియోగిస్తారు. అదే సేలం రకమైతే అయిదు లేదా అయిదున్నర పుట్లతో సరిపెడుతున్నారు. సంప్రదాయ ఎద్దు నాగలితో ఎక్కువమంది రైతులు కూలీలను వినియోగించి పసుపు విత్తుతున్నారు. కొందరు అభ్యుదయ రైతులు సొంతంగా తయారు చేయించిన పరికరంతో ఎత్తుమడులపై పసుపును విత్తుతూ అటు కూలీల కొరతను అధిగమిస్తూ తక్కువ విత్తనంతో సరిపెడుతూ పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటున్నారు.


ప్రత్యేక పరికరంతో ఎత్తుమడులపై పసుపు విత్తుతున్న కూలీలు


తూములూరులో పసుపు విత్తనం

విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నాం



జిల్లాలో పసుపు సీజను ఆరంభమైంది. సాధారణ విస్తీర్ణం 3,900 ఎకరాలుగా ఉంది. ఈసారి 4500 వరకు పసుపు సాగవుతుందని భావిస్తున్నాం. రైతులు శాస్త్రీయమైన పద్ధతిలో పసుపును విత్తుకుని తగిన సస్యరక్షణ చర్యలతో ఎక్కువ దిగుబడులను పొందాలని కోరుతున్నాం.

– బి.రవీంద్రబాబు, జిల్లా ఉద్యాన అధికారి

నిబంధనల మేరకు ఆలయాలు అప్పచెప్పండి

- దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశం
- నాలుగు జిల్లాల ఈఓలతో సమీక్ష


మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ, వేదికపై అదనపు కమిషనర్ రామచంద్ర మోహన్

గుంటూరు ఈస్ట్: జీవో 298 అనుసరించి రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న దేవాలయాలను వంశపారంపర్య ధర్మకర్తలు, అర్చకులకు నిబంధనలను అనుసరించి స్వాధీనం చేయాలని దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ జిల్లా అధికారులను ఆదేశించారు. కొత్తపేటలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఒంగోలు జిల్లాల ఈవోలతో అధికారులు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆక్రమణలకు గురైన భూములను ఆర్డినెన్స్–5 అనుసరించి ఎగ్జిక్యూటివ్ అధికారి ఆక్రమణదారుడికి తొలుత నోటీసులు జారీ చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆదేశించారు. అప్పటికీ ఆక్రమణ చేసి ఉంటే పోలీసు, రెవెన్యూ శాఖల సహకారంతో భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉండే దేవదాయ, ధర్మాదాయ భూముల వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేయాలన్నారు. అనంతరం అవి సరిగా ఉన్నాయోలేదో సరిచూడాలని సూచనలు చేశారు. అర్చకులకు ఇల్లు నిర్మించేందుకు స్థలాలు సేకరించి అర్హులైన వారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్‌లో వంశపారంపర్య అర్చకుల పేర్లు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్, డెప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమాజంలో మార్పు కోసం యువత కదలాలి

సినీ దర్శకుడు, నటుడు ఆర్. నారాయణమూర్తి


ఆర్. నారాయణమూర్తిని సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: మెరుగైన సమాజ రూపకల్పన దిశగా యువతరం నడుం బిగించాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్. నారాయణమూర్తి తాను ఇటీవల నిర్మించిన సందేశాత్మక చిత్రం 'యూనివర్సిటీ' విశేషాలను గురించి విద్యార్థులకు వివరించారు. యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థులు లక్ష్యంగా వారి భవిష్యత్, వారు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను ప్రస్తావిస్తూ నిర్మించిన చిత్రాన్ని యువతరం ఆదరించాలని కోరారు. గత వేసవిలో విడుదల చేసిన యూనివర్సిటీ చిత్రాన్ని విద్యార్థులు, యువతరం కోసం త్వరలోనే రీ–రిలీజ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తిని కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జేవీ సుధీర్‌కుమార్, ఎన్‌సీసీ మేజర్ కుమార్ రాజా, అధ్యాపకులు పాల్గొన్నారు.

దోచుకుందీ.. దాచుకుందీ నరేంద్రే!

- టీడీపీని అడ్డం పెట్టుకుని కోట్లు గడించాడు!
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

చేబ్రోలు: టీడీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని మాజీ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ కోట్లాది రూపాయలు దోచుకున్న సంగతి రాష్ట్రంలోని పాడి రైతులందరికీ, నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిలారి మాట్లాడుతూ తాను ఎండోమెంట్ భూములు కాజేయడానికి కుట్ర చేస్తున్న అనే మాటకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కట్టుబడి ఉన్నావా అన్నారు. దేవుని ఎదుట నేను చేసిన ప్రమాణాన్ని కూడా అపహాస్యం చేస్తున్నావని, దమ్ము ధైర్యం ఉంటే నిరూపించాలన్నారు. నీవు కూడా దేవుని ఎదుటకు వచ్చి ప్రమాణం చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య డిమాండ్ చేశారు. దుష్ప్రచారాల పార్టీ (టీడీపీ) ఓర్వలేక తప్పుడు ప్రచారానికి పూనుకుందన్నారు. పొన్నూరులో ఆటోనగర్, రోడ్డు విస్తరణ పనులకు అడ్డం పడుతూ అభివృద్ధికి నిరోధకంగా మారాడని దుయ్యబట్టారు. ఆటోనగర్ రాకుండా సుబ్బాయమ్మ పేరుతో అక్రమ కేసులు వేయించి అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నది నరేంద్ర కాదాని ప్రశ్నించారు. ఆటోనగర్, జీబీసీ రహదారి విస్తరణ తప్పకుండా పూర్తి చేసి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా.. దొంగ నాటకాలు, దుష్ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకునే పరిస్థితి నరేంద్ర అని ఆయన విమర్శించారు.

మల్టీడే క్రికెట్ విజేత గుంటూరు



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అంతర జిల్లాల సీనియర్ పురుషుల మల్టీడే క్రికెట్ మ్యాచ్ విజేతగా గుంటూరు నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు ఏసీఏ(సీపీ, డీవీఆర్) మైదానంలో ఆరు ఇన్నింగ్స్‌లలో నిర్వహించిన మ్యాచ్‌లలో ఉమ్మడి గుంటూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడ్డాయి. అత్యధికంగా 13 పాయింట్లతో గుంటూరు ప్రథమ స్థానంలో నిలవగా తొమ్మిది పాయింట్లతో పశ్చిమగోదావరి రెండో స్థానంలో, ఆరు పాయింట్లతో కృష్ణా మూడో స్థానంలో, రెండు పాయింట్లతో ప్రకాశం నాలుగో స్థానంలో నిలిచాయి.

16, 17 తేదీల్లో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ


పోస్టరు ఆవిష్కరించిన కృష్ణప్రసాద్, క్రీడాకారులు

తెనాలి: తెనాలిలోని స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16, 17వ తేదీల్లో రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నారు. స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో నాలుగు కేటగిరీల్లో సింగిల్, డబుల్స్ పోటీలను నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఆంధ్రాప్యారిస్ కప్ పేరుతో డబుల్‌హార్స్ మినపగుళ్ల గ్రూపు సౌజన్యంతో జరిగే ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం స్టేడియంలో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డబుల్‌హార్స్ మినపగుళ్ల జనరల్ మేనేజరు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పట్టణ, పరిసరాల్లో క్రీడలను అభివృద్ధి చేసి క్రీడాకారులను తీర్చిదిద్దాలనే ఆశయంతో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చదువుతోపాటు క్రీడలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నది తమ ఆశయమన్నారు. కార్యక్రమంలో స్టేడియం హ్యాండ్‌బాల్ కోచ్ కె.నాగరాజు, సునీల్, శ్రీనివాస్, రాము, సాంబశివరావు, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

పారిశ్రామికీకరణతో ఉపాధికి భరోసా

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: వ్యవసాయంతోపాటు పరిశ్రమలు విరివిగా స్థాపిస్తేనే యువత ఉపాధి మార్గాలు మెరుగవుతాయని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇస్తున్న రాయితీలకు పారిశ్రామిక వేత్తలు అందించిన దరఖాస్తులు నిబంధనల మేర పరిశీలించి నిష్పక్షపాతంగా అర్హులను గుర్తించాలన్నారు. నూతన పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిశీలించాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. జిల్లాలో 26 పరిశ్రమలకు సంబంధించి 36 క్లెయిమ్స్‌లో రూ.2.95 కోట్లు మంజూరు చేస్తూ సమావేశం ఆమోదించింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం విజయ రత్నం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి.గోపీకృష్ణ, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఏ.రఘునాథ బాబు, బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

బడిమానేసే పిల్లల కోసం ప్రత్యేక శ్రద్ధ

గుంటూరు వెస్ట్: విద్యతోనే పేదరికాన్ని దూరం చేసుకునే అవకాశముంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలలకు పంపించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్ మాట్లాడుతూ డ్రాపవుట్స్‌గా ఉన్న చిన్నారులను పాఠశాలలకు తీసుకొచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరిస్తున్నామన్నారు. ఈ నెల 12న మేడికొండూరులోని జడ్పీ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించినప్పుడు పాఠశాలలో మొత్తం 542 ఉండాల్సి ఉండగా 478 మంది విద్యార్థులున్నారన్నారు. 64 మంది పాఠశాలకు రాలేదని చెప్పారు. ఈ విషయమై పాఠశాల సిబ్బందితో చర్చించి 20 నుంచి 25 మంది విద్యార్థులకు ఒక టీచర్ దత్తత తీసుకుని వారికి రెగ్యులర్ హాజరు, స్కూల్ యూనిఫాం, బూట్లు, జగనన్న గోరుముద్ద అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి విద్యతో చిన్నారుల భవిష్యత్తు ఎలా మారుతుందో వివరిస్తున్నామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, డీఈఓ శైలజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆయుధ సామగ్రి తనిఖీ చేసిన ఎస్పీ

ఏఆర్ అధికార, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం


తుపాకీని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ కోటేశ్వరరావు

నగరంపాలెం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్)లో ఆయుధాలు నిల్వ ఉంచే గది, ఏఆర్ డ్యూటీ ఆర్ఎస్ఐ కార్యాలయం, డాగ్ స్క్వాడ్‌ను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తుపాకీలను ఆయన పరిశీలించారు. ఎస్కార్ట్, వీఐపీలు, బందోబస్త్ విధులు ముగిశాక ఆయుధాలను భద్రంగా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించి, ఆహారం, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వాటిని పర్యవేక్షణ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏఆర్ పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అనారోగ్య సమస్యకు గురైతే, జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ చెప్పారు. అదే విధంగా విధుల పరంగా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తెలియజేయాలన్నారు. ఏఆర్ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్పీ వెంట ఏఆర్ ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖర్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రాఘవయ్య, రమేష్‌కృష్ణన్, ఎస్‌బీ సీఐ బి. నరసింహారావు, ఆర్ఎస్ఐలు ఉన్నారు.

వైకుంఠపురం ఆలయ సూపరింటెండెంట్‌పై కేసు

తెనాలిరూరల్: హుండీ లెక్కింపు సందర్భంగా చేతివాటం ప్రదర్శించిన తెనాలి వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సూపరింటెండెంట్ నిర్మలాకుమారిపై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నెల 12వ తేదీన ఆలయ హుండీ లెక్కింపు సందర్భంగా నిర్మలకుమారి బంగారు ఉంగరాన్ని తీసి ఆమె తన చేతికి పెట్టుకోవడాన్ని లెక్కింపులో ఉన్న కొందరు గమనించారు. ఇదే విషయాన్ని ఆలయ సహాయ కమిషనర్ తిమ్మానాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన విచారించి ఆమెను అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. ఇదే విషయాన్ని తిమ్మానాయుడు వన్‌టౌన్ పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం అర్ధరాత్రి కేసు నమోదు చేసినట్టు సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మాజీ క్రికెటర్ అంబటి రాయుడు


విద్యార్థులతో మాట్లాడుతున్న క్రికెటర్ అంబటి రాయుడు

తాడికొండ: చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సూచించారు. మండలం కంతేరు, తాడికొండ, గరికపాడు గ్రామాలలో శుక్రవారం పర్యటించారు. కంతేరులోని గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. సేవలు, రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం తాడికొండ చేరుకొని షిరిడి సాయి పర్తిసాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచారు. మీకు ఇష్టమైన క్రికెటర్ ఎవరూ అని విద్యార్థులు ప్రశ్నించగా సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోని అని చెప్పారు. చిన్న వయసులో రిటైర్‌మెంట్ ఎందుకు తీసుకున్నరన్న ప్రశ్నకు స్పందించిన ఆయన ప్రతి క్రికెటర్‌కు కొంత సామర్థ్యం ఉంటుందని 14 సంవత్సరాల కెరియర్ తనకు సంతృప్తినిచ్చిందని, యువ క్రికెటర్లకు కూడా అవకాశం కల్పించేందుకే రిటైర్ అయినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఏపీలో విద్యా వ్యవస్థ, పరిపాలన చాలా బాగుందని, మెరుగైన వసతులు ఉపయోగించుకొని కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల కోరిక మేరకు క్రీడా స్థలంలో క్రికెట్ ఆడారు. బ్యాట్లపై సంతకాలు చేశారు. బడేపురంలో పర్యటించారు. బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాల విద్యార్థులతో క్రికెట్ ఆడి వారితో కలసి కాసేపు ముచ్చటించారు. గరికపాడులో రైతులతో భేటీ అయిన ఆయన వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే ఇంకా ఏం చర్యలు తీసుకుంటే మేలో తెలుసుకున్నారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి పాల్గొన్నారు.